
సాక్షి
మెదక్
శనివారం । 13 । జూలై । 2024



సర్వే చేయక.. సాగు సాగక
సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్న భూ సర్వే చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
వివరాలు 8లో ▸



ఇంటికి ఆరు మొక్కలు
వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.
వివరాలు 9లో ▸

23న జాబ్ మేళా
మెదక్‌జోన్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. ఇందుకు సంబంధించి శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివరాలకు 7893822745, 9951101545 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పథకాలతో ప్రజలకు మేలు: డీపీఓ



మాట్లాడుతున్న డీపీఓ యాదయ్య

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. శుక్రవారం టేక్మాల్ రైతువేదికలో 97 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు సైతం ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దీన్, వ్యవసాయాధికారి రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, సూపరింటెండెంట్ విష్ణువర్ధన్, ఆర్‌ఐ సాయి శ్రీకాంత్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని హెచ్‌ఎం పర్వతవర్ధిని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 17, 7వ తరగతిలో 4, 8వ తరగతిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సీట్ల భర్తీ కోసం ఈనెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 20వ తేదీ లోగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని వివరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు ఖేడ్ డిపో మేనేజర్ మల్లేశం తెలిపారు. శుక్రవారం ఆయన పెద్దశంకరంపేట బస్టాండ్‌ను సందర్శించి మాట్లాడారు. ఈనెల 21న గురుపూర్ణిమ సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. 19న బస్సులు బయలుదేరి కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటాయన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో జోగులాంబ శక్తిపీఠం దర్శించి, 22వ తేదీ సాయంత్రం వరకు నారాయణఖేడ్ చేరుకుంటాయన్నారు. రానుపోను బస్సు చార్జీలు రూ.4,500 మాత్రమే తీసుకుంటున్నామని తెలిపారు. భోజనాలు, దర్శనం, వసతి ఖర్చులు ఎవరికి వారే భరించుకోవాలన్నారు. బస్సు బుకింగ్ కోసం 8639184828, 9676667703, 9441071134 నంబర్లలలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో పీఆర్‌ఓ పాండు, శంకరంపేట కంట్రోలర్ వైద్యనాథ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు 9వ బ్యాచ్ త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి బ్యాచ్‌లో 30 మంది అభ్యర్థులు ఉంటారని, 3 నెలల శిక్షణ ఉంటుందని వివరించారు. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్, కంప్యూటర్ కోర్సు, సీసీటీవీ రిపేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ తదితర వాటిలో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం సెంటర్ ఇన్‌చార్జి మనిషా 7396313741 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ జావేద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంతో పాటు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, అవుసులపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

కదం తొక్కిన విద్యార్థులు

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

మెదక్ కలెక్టరేట్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కదం తొక్కారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ.. ఆరేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. స్కాలర్‌షిప్‌లు సైతం ఇప్పటివరకు అందలేదన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రామాయంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కూచారం కేజీబీవీలో దోమల సమస్య పరిష్కరించాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షులు నవీన్, శ్రావణి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

గంగ.. బెంగ

పడిపోతున్న భూగర్భజలాలు
- ఆశించిన స్థాయిలో లేని వర్షాలు
- గతేడాదితో పోలిస్తే 2.37 మీటర్ల లోతులోకి నీటిమట్టం
- ఆందోళనలో అన్నదాతలు

జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాలు నానాటికి పడిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర కావొస్తున్నా ఇప్పటికి చెప్పుకోదగ్గ వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. దీంతో జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాలేదు. ఫలితంగా బోరుబావులు ఫెయిల్ అవుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. – మెదక్‌జోన్

జిల్లాలో 90 శాతానికి పైగా రైతులు బోరుబావుల ఆధారంగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో చెప్పుకోదగ్గ సాగునీటి ప్రాజెక్టులు లేవు. ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఘనపూర్‌తో పాటు హల్దీ ప్రాజెక్టు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఘనపూర్ ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టుపై ఆధారపడగా.. హల్దీలోకి గోదావరి జలాలు వదిలితేనే నీరు వస్తోంది. లేదా ఎగువ ప్రాంతాల్లో పుష్కలంగా వర్షాలు కురిస్తే వరద నీటితో నిండుతాయి. కానీ ఈ ఏడాది సరైన వర్షాలు కురవకపోవడంతో వీటిలో చుక్కనీరు లేదు. గతేడాది 2023 జూన్‌లో భూగర్భజలాలు 11.60 మీటర్ల లోతులో ఉండగా, ఈ ఏడాది జూన్‌లో 13.97 మీటర్ల లోతుకు పడిపోయాయి. అంటే గతేడాదితో పోలిస్తే 2.37 మీటర్ల లోతులోకి వెళ్లినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. భూగర్భజలాలు వేగంగా పడిపోవడానికి మరో ముఖ్య కారణం వాగులు, వంకల్లో నుంచి అక్రమార్కులు ఇసుకను అడ్డగోలుగా తరలించడం. అడ్డుకోవాల్సిన అధికారులు వారికి వత్తాసు పలకడంతో ఇసుక యథేచ్ఛగా తరలిపోతుందనే ఆరోపణలు ఉన్నాయి.



నీరు లేక వెలవెలబోతున్న కోంటూరు పెద్ద చెరువు

ఆరుతడి పంటలకు అనుకూలం

కాగా ఈ ఏడాది జూన్‌లో 120.4 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, జిల్లాలో 125.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ వర్షం కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే అనుకూలంగా ఉందన్నారు. జలాశయాలకు నీరు వచ్చే విధంగా ఇప్పటివరకు ఒక్క పెద్ద వర్షం పడలేదన్నారు. గతేడాది వర్షాకాలంలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండగా, యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 3.20 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. దీంతో నిరంతరంగా బోర్లు నడిపించడంతో పాతాల గంగను పూర్తిగా ఎత్తిపోశాయి. ఈ ఏడాది ఇప్పటివరకు చెప్పుకోదగ్గ వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు ఏమాత్రం పెరగడం లేదు.

వరిసాగుపై తీవ్ర ప్రభావం

మరో వారం పది రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురవకుంటే వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏటా నారుమళ్లు జూన్ 15 వరకు పోసి జూలై 25వ తేదీ వరకు నాట్లు వేయాలి. లేదా జూలై 30 వరకు నాట్లు పూర్తి చేయాలి. అప్పుడే ఆశించిన దిగుబడి వస్తోందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో 3,27,113 ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేయగా, ఇప్పటివరకు కేవలం 3 వేల ఎకరాల పైచిలుకు మాత్రమే సాగైందంటే వరిసాగు ఎంత వెనకబడి పోయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సెర్ప్, స్త్రీ నిధి సిబ్బంది, ఏపీఎంలు, సీసీలు, జిల్లా మహిళా సంఘ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద గ్రామ సమాఖ్యలోని సంఘాలకు ప్రభుత్వం కోటి రూపాయల వరకు రుణాలు అందజేస్తుందని చెప్పారు. అలాగే ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ. 5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించాలని సూచించారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ పథకంలో 11,618 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.106.93 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక చేపట్టినట్లు పేర్కొన్నారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మనెంట్ స్టిచ్చింగ్ సెంటర్లు, పాడి గేదెల పెంపకం, మీసేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితర 14 రకాల వ్యాపారాలు ఇందులో భాగమని వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని అన్నారు. చిరు వ్యాపారులను ప్రోత్సాహిస్తూ లబ్ధిదారులను నిర్ణీత సమయంలోగా గుర్తించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిర, అడిషనల్ డీఆర్డీఓ సరస్వతి, డీఈఓ రాధాకిషన్, ఇతర జిల్లా అధికారులు నర్సింహారావు, కృష్ణమూర్తి, విజయశేఖర్‌రెడ్డి, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు నవనీత, ఏపీఎంలు, సీసీలు, వివిధ మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత

మెదక్ మున్సిపాలిటీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడదాం అని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల్లో కమిషనర్ జానకీరాంసాగర్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల మధ్య, పాత టైర్లు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి వ్యాధులు వ్యాపింపజేస్తాయని వివరించారు. మురికి కాల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ ఫౌడర్ వేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఆర్పీలు, జవాన్లు ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేదవతి, విశ్వం, సమీయొద్దీన్, సులోచన, గాయత్రి, మాజీ వైస్ చైర్మన్ అశోక్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం, టీచర్‌కు షోకాజ్ నోటీసులు

మెదక్ కలెక్టరేట్/రామాయంపేట(మెదక్): రామాయంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినులను ఎలుకలు కరువడంపై కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పందించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎంతో పాటు సంబంధిత తరగతి ఉపాధ్యాయురాలికి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విద్యార్థులను ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించినట్లు చెప్పారు. అలాగే పాఠశాలను తహసీల్దార్, ఆర్డీఓ సందర్శించి అన్నిరకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు ఎలుకలు పాఠశాలలోకి రాకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు అనారోగ్యంతో ఉండడంతో వైద్య సెలవులు మంజూరు చేశారు. భౌతికశాస్త్రం ఉపాధ్యాయురాలు పద్మకు హెచ్‌ఎం బాధ్యతలు అప్పగించారు. ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ, ఇతర వైద్య సిబ్బంది పాఠశాలను సందర్శించి బాధిత విద్యార్థినులను పరీక్షించారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆమె నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ వాయిదా వేయాలని నిరుద్యోగులు దీక్షలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. కనీసం వారితో చర్చలు జరపకపోవడం సరికాదన్నారు. ఓయూలో నిరుద్యోగులు డీఎస్సీని వాయిదా వేయాలని ఉద్యమం చేపడితే, కవర్ చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు లాఠీచార్జి చేశారని వాపోయారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మమత ఆస్పత్రి, మున్సిపల్ కార్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, మున్సిపల్ కమిషనర్ జైత్‌రాంనాయక్, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

రైతులకు అండగా ఉంటాం

రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సునీతారెడ్డి హామీ ఇచ్చారు. కొండపోచమ్మ కాలువ వద్దు.. సెమి అర్బన్ ముద్దు.. సంగారెడ్డి కాలువ రిచ్– 2కు తమ భూములు ఇవ్వమన్న డిమాండ్‌తో పలు గ్రామాల రైతులు శుక్రవారం చౌరస్తాలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. రైతుల దీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షంలో ఉన్న కొందరు నాయకులు రైతులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వారి పార్టీ అధికారంలోకి రాగానే రైతుల సమస్యలను పక్కన పెట్టారన్నారు. సంగారెడ్డి కాలువకు ప్రభుత్వం భూమి సేకరించాలనుకుంటే భూమికి భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో ఎకరానికి రూ.60 నుంచి రూ.70 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హెచ్‌ఎంపై దాడికి యత్నం.. కేసు నమోదు

పాపన్నపేట(మెదక్): క్యాజువల్ లీవ్‌ల కోసం కక్కుర్తిపడిన టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ఓ మహిళా హెచ్‌ఎంపై దాడికి యత్నించగా కేసు నమోదు చేసినట్లు పాపన్నపేట ఏఎస్సై సంగన్న తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎంకెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న జిడ్డ ఎల్లం ఇటీవల తూప్రాన్ మండలానికి బదిలీ అయ్యారు. ఎల్‌పీసీ తీసుకోవడానికి కొడుపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యం వద్దకు వచ్చారు. క్యాజువల్ లీవ్‌లు తక్కువగా వినియోగించుకున్నట్లు నమోదు చేయాలని కోరాడు. అన్నిరకాల సెలవులు ఆన్‌లైన్ చేస్తున్నందున అలా చేయడం కుదరదని ఆమె బదులిచ్చారు. దీంతో ఎల్లం ఆగ్రహం వ్యక్తం చేస్తూ నేను ఓ యూనియన్ జిల్లా అధ్యక్షుడిని, నీ అంతు చూస్తానంటూ కుర్చీ పైకి లేపినట్లు హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హక్కులు కాలరాస్తున్న చర్యలేవి?

డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్

మెదక్ కలెక్టరేట్: సమాజంలో ఇంకా కులం పేరుతో దళితులను అంటరానివారిగా చూస్తున్నారని, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అశ్వరావుపేట ఎస్‌ఐ శ్రీనివాస్ విషయంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ హాజరై మాట్లాడుతూ.. ఎస్సై మరణానికి కారకులైన సీఐ జితేందర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ. కోటి ఆర్థిక సాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మల మైసయ్య మాట్లాడుతూ.. చిన్న చిన్న ఉద్యోగుల నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌ల వరకు దళితులను అంటరాని వారిలాగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15న దళితులపై జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ మెదక్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్, చంద్రం, దయసాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్

అయోమయం!



సాక్షి, సిద్దిపేట: జిల్లాలో బదిలీల కోసం 1,032 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. జూన్ 30న ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే 1,032 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు అందాయి. అందులో 803 మందికి మాత్రమే రిలీవ్ చేశారు. ఇంకా 229 మందిని రిలీవ్ చేయలేదు. 2021లో విడుదలైన రేషనలైజేషన్ జీఓ 25 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 10లోపు విద్యార్థులుంటే ఒకరు, 11 నుంచి 40 వరకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని నిబంధన ఉంది. విద్యార్థులుండి ఉపాధ్యాయులు బదిలీలలో కొత్త వారు రాకుంటే పాత వారిని రిలీవ్ చేయలేదు. దీంతో బదిలీ అయినప్పటికీ పాత స్థానంలోనే 229 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. రిలీవ్ చేయాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

దక్కని ప్రయోజనం

పలువురు ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ కొత్త స్థానంలో జాయిన్ కాకపోవడంతో ప్రయోజనం దక్కడం లేదు. బదిలీ ఉత్తర్వులు వచ్చి రెండు వారాలు కావస్తున్నా వారిని రిలీవ్ చేయడం లేదు. పాఠశాలకు, ఇంటికి దగ్గరలో బదిలీ అయ్యామన్న ఆనందం దక్కడం లేదు. రిలీవ్ చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

జాబ్‌మేళాలతో ఎంతో ఉపయోగం

సిద్దిపేటఎడ్యుకేషన్: నిరుద్యోగులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని జిల్లా ఉపాధికల్పనాధికారి రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వడిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఉపాధికల్పనా, కళాశాల ఫిజిక్స్ విభాగం, తెలంగాణ స్కిల్ నాలెడ్జ్‌సెంటర్ (టీఎస్‌కేసీ)ల ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. మన చెంతకు వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని ఉపాధి పొందాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకుని యువత ముందుకు సాగాలన్నారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్ తదితర 8 కంపనీల ప్రతినిధులు పాల్గొని తమకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకున్నారు. ఫిజిక్స్ విభాగాధిపతి, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్ మాట్లాడుతూ మేళాకు చక్కని స్పందన లభించిందన్నారు. మొత్తం 450 మంది అభ్యర్థులు హాజరుకాగా 125 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయినట్లు చెప్పారు.



మినీ జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

క్లుప్తంగా

తుది గడువు 15

ఉత్తమ ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈ నెల 15 వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని, జిల్లాలోని అర్హత, ఆసక్తిగల ఉపాధ్యాయులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాధాకిషన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతిని డీఈఓ కార్యాలయంలో గడువు తేదీలోగా అందజేయాలని తెలిపారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి



అక్కన్నపేట(హుస్నాబాద్): వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన అక్కన్నపేట మండలం మైసమ్మ వాగు తండాలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జరుపుల నర్సింహ, వెన్నెల దంపతుల కుమారుడు రిషి(3) శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్నాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసి గాయపరిచాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, అంగన్‌వాడీ టీచర్, ఆయాల నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడిపై కుక్కలు దాడి చేశాయని బాలుడి తండ్రి నర్సింహ అన్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్: పట్టుబడిన మద్యం బాటిళ్లను ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు సిద్దిపేట అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జగన్నాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ సైదా, ఎక్సైజ్ సీఐ బ్రహ్మనందరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ పోలీస్‌స్టేషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతేడాది ఎన్నికల్లో పట్టుబడిన 37 కాటన్ల బీర్లు, క్వాటర్ బాటిళ్లతోపాటు ఎంపీ ఎన్నికల్లో పట్టుబడిన 24 కాటన్ల మద్యం బాటిళ్లను ధ్వంసం చేశామన్నారు.

పాన్, పొగాకు స్వాధీనం

సంగారెడ్డి: నిషేధిత గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ల అమ్మకాలపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు సంగారెడ్డి పట్టణంలోని శివాజీ నగర్‌కు చెందిన సద్దుల శ్రీనివాస్ అక్రమంగా పాన్ మసాలా, పొగాకు విక్రయిస్తున్నాడని అతడి ఇంటిలో తనిఖీలు చేపట్టారు. సుమారు రూ.2 లక్షల విలువ గల పాన్ మసాలా, సిగరెట్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ సంజీవరావు వెల్లడించారు.

మహిళపై హత్యాయత్నం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళపై హహత్యాయత్నం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన రామచంద్రాపురం పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రామచంద్రాపురం పట్టణంలోని కాకతీయనగర్‌లో నివాసముండే శ్రీరామ్ ప్రియాంక భర్తతో గొడవ కావడంతో కుమారుడితో కలిసి ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 5వ తేదీన ఆమె మేనమామ సంజీవ్‌రావు మద్యం సేవించి ఇంటికొచ్చి ప్రియాంకతో గొడవపడ్డాడు. మరోసారి ఇంటికి రావొద్దని ఆమె తండ్రి తిట్టి పంపించాడు. ఈ నెల 10వ తేదీన సంజీవరావు మళ్లీ మద్యం తాగి ఇంటికొచ్చాడు. ప్రియాంకతో గొడవకు దిగి కూరగాయలు కోసే కత్తితో ఆమె దాడి చేశాడు. పై గదిలో ఉన్న నాగరాజు వచ్చి కత్తి తీసుకోగా సంజీవ్ రావు పరారయ్యాడు. బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సంజీవరావును అదుపులోకి తీసుకొని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

సర్వే చేయక.. సాగు సాగక

హుస్నాబాద్ మండలం తోటపల్లికి చెందిన పీ.మల్లయ్య రెండేళ్ల కిందట భూమి సర్వే చేయాలని ఫీజు చెల్లించి అధికారులకు అప్పగించారు. రైతుల భూమి హద్దులు సరి చేయాలంటే వర్షాకాలం ముందే చేయడానికి అనువుగా ఉంటుంది. వానలు ఎక్కువ పడితే పక్క రైతులు పంటలు సాగు చేస్తారు. వారి భూముల్లోకి సర్వే చేయడానికి అభ్యంతరం చెబుతారు. పంటలు లేని సమయంలోనే భూ సర్వే చేస్తే ఇరు పక్షాలకు అనుకూలంగా ఉంటుంది. భూమి సర్వే కోసం ఈ రైతు రెండేళ్ల నుంచి తిరుగుతూనే ఉన్నాడు. వారం కిందట మంత్రి ఓఎస్డీతో ఫోన్ చేయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇది రైతు మల్లయ్య ఒకరి సమస్యనే కాదు హుస్నాబాద్ డివిజన్‌లో 511 మంది రైతులు సర్వేయర్ల కోసం 2022 నుంచి ఎదురుచూస్తున్నారు.

- భూముల సర్వే కోసం రైతుల ఎదురుచూపు
- తెగని గెట్టు పంచాయితీలు?
- సర్వేయర్లకు గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ సర్వే అప్పగింత
- ఏళ్లుగా నిలిచిన వ్యవసాయ పనులు
- దరఖాస్తు చేసుకున్న 511 మంది



తోటపల్లిలో సర్వే చేయక బీడుగా వదిలేసిన భూములు

హుస్నాబాద్‌రూరల్: పల్లెలో చినుకు పడగానే వ్యవసాయ పనులను రైతులు మొదలు పెడుతారు. ఇక్కడే భూముల హద్దులు జరిగాయని పక్కన పక్కన రైతులు గొడవ పడి దాడులు చేసుకొని ప్రాణాలు కోల్పోతారు. ప్రతీ ఏటా వేసవి కాలంలో పంటలు కోసిన అనంతరం రైతులు భూములు సర్వే చేయడానికి మండల సర్వేయర్లను ఆశ్రయిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమి సర్వే చేయడానికి కావాల్సిన రుసుంను బ్యాంక్ చలాన్ ద్వారా చెల్లించి అధికారులకు ఇస్తే వారు సమీప రైతులకు నోటీసులు ఇచ్చి భూమి సర్వే చేస్తారు. 2022 నుంచి డివిజన్ సర్వేయర్‌కు 511 మంది దరఖాస్తు చేసుకున్న వాటిలో ఒకటి కూడా భూ సర్వే చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

కెనాల్ సర్వే పనుల్లో అధికారులు

గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్స్ కోసం 2,400 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఇందులో 1,900 ఎకరాల వరకు భూ సర్వేను పూర్తి చేశారు. మరో 500 ఎకరాలు పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల అధికారుల సమీక్షలో ఆదేశించారు. జిల్లాలోని సర్వేయర్లు నాలుగు బృందాలుగా ఏర్పడి కెనాల్ భూముల కోసం కోహెడ, హుస్నాబాద్ మండలాల్లో భూ సర్వే చేస్తున్నారు. ఇక నెల రోజులు కెనాల్ భూముల సర్వే చేస్తే రైతుల భూములు ఎవరు సర్వే చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్లను కెనాల్ పనులు అప్పగిస్తే మండలాల రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఓ ప్రైవేట్ సర్వేయర్‌ను నియమించి రైతుల భూ సర్వే చేయాల్సిన అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

డిజిటల్ పరికరాల కొరత..

ప్రస్తుతం అంతా డిజిటల్ పరికరాలనే వాడుతూ భూములు సర్వే చేస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్లు వచ్చినప్పటికీ వాళ్లు ప్రైవేట్ సంస్థల నుంచి డిజిటల్ మిషన్స్ కిరాయి తెచ్చుకుంటున్నారు. దీని కిరాయి రోజుకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటారు. డిజిటల్ పరికరాలు ఉంటే భూమి సర్వే సులభమవుతుంది. సమస్యలు కూడా సరిగ్గా పరిష్కారమవుతాయని రైతుల అంగీకారం మేరకు అధికారులు డిజిటల్ మిషన్ తెచ్చి సర్వే చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులకు డిజిటల్ మిషన్ కిరాయి ఆర్థిక భారంతో వారి భూ సమస్యలు పెండింగ్‌లో పెడుతున్నారు. ఒక ఎకరం సర్వే చేయాలంటే మిషన్ కిరాయి రూ.6 వేలు రైతులు భరించాల్సిందే.

ఏడు నెలలుగా తిరుగుతున్నా..



నాకు తోటపల్లి శివారు సర్వే నంబర్ 207లో 0.20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. నేను హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. సొంత జాగా చిన్న ఇల్లు నిర్మాణం చేసుకుంటానని 2023 అక్టోబర్‌లో పనులు మొదలు పెట్టిన. పక్క రైతు గెట్టు పంచాయితీ పెట్టగా నేను భూమి సర్వే చేయాలని చలాన్ కట్టిన. ఏడు నెలల నుంచి సర్వే కోసం తిరిగినా ఇప్పటి వరకు చేయలేదు. నా ఇల్లు పని పునాది వద్దే ఆగింది.

– కొడముంజ సురేశ్, రైతు

కెనాల్ భూ సర్వే అప్పగించారు

హుస్నాబాద్ డివిజన్ పరిధిలో రైతులు భూమి హద్దుల పంచాయితీ పెట్టుకొని సర్వే కోసం దరఖాస్తు పెట్టారు. ప్రభుత్వం ప్రాజెక్టు కెనాల్ భూ సర్వే చేయాలని చెప్పడంతో నాలుగు బృందాలుగా ఏర్పడి 500 ఎకరాల కెనాల్ భూములు సర్వే చేస్తున్నాం. ఈ నెల 20 తర్వాత అధికారుల బదిలీల్లో కొత్త సర్వేయర్లు వస్తే అప్పుడు రైతుల భూములు సర్వే చేస్తారు.

– శ్రీనివాస్, డివిజన్ సర్వేయర్, హుస్నాబాద్

పారదర్శకత లోపిస్తే సహించం

- అక్రమంగా డ్రా చేసిన ఉపాధి హామీ డబ్బులు రికవరీ చేయాలి
- డీఆర్‌డీఏ అడిషినల్ పీడీ బాలకృష్ణ



ప్రజా వేదికలో మాట్లాడుతున్న బాలకృష్ణ

కొండపాక(గజ్వేల్): ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతలు లోపిస్తే సహించేది లేదంటూ డీఆర్‌డీఏ అడిషినల్ పీడీ బాలకృష్ణ హెచ్చరించారు. మంగోల్ గ్రామంలో అక్రమంగా డ్రా అయిన రూ.3 లక్షల పైచిలుకు డబ్బులను బాధ్యుల నుంచి తొందరగా రికవరీ చేయాలన్నారు. కొండపాకలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. ఉమ్మడి కొండపాక మండలంలోని మంగోల్ గ్రామంలో 2023–2024 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అధికారులు రూ.3 లక్షల పైచిలుకు డబ్బులు అక్రమంగా డ్రా చేశారంటూ మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి ప్రజా వేదిక దృష్టికి తీసుకొచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ భర్త ఒక్క రోజు పనికి వెళ్లకున్నా రూ.9,100 డ్రా చేయడంతోపాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వారి పేరిట సైతం డబ్బులు డ్రా అయ్యాయంటూ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీన్ని కప్పిపుచ్చేందుకు గ్రామంలో సోషల్ ఆడిట్ నిర్వహణ కోసం వచ్చిన డీఆర్పీ రూ.35 వేలు లంచంగా ఇవ్వాలంటూ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసినట్లు ఆధారాలున్నాయని వెల్లడించారు. మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్ చారి కనుసన్నల్లో సుమారు రూ.3 లక్షల ఈజీఎస్ పనుల నిధులను అక్రమంగా డ్రా చేశారంటూ దృష్టికి తీసుకురావడంతో సుమారు గంట పాటు ప్రజా వేదిక రసాభాసగా మారింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. పనుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదంటూ హెచ్చరించారు. అనంతరం వివిధ గ్రామాల్లో జరిగిన పనులు, ఖర్చు చేసిన డబ్బుల విషయంలో ప్రజా వేదిక కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ తనిఖీ అధికారులు, ఫీల్డ్ అసిసెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను చేర్చాడు.. ప్రాణాలు వదిలాడు

- గుండెపోటుతో కర్నాటక ఆర్టీసీ డ్రైవర్ మృతి
- జహీరాబాద్‌లో ఘటన



బస్సులో కుప్పకూలిపోయిన మహదేవ్

జహీరాబాద్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమైనదంటూ సంస్థ చేస్తున్న ప్రచారం మరోమారు అక్షరాల చాటి చెప్పింది. ప్రయాణికులను భద్రంగా బస్టాండ్‌కు చేర్చి కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్ గుండెపోటుకు గురై ప్రాణాలు వదిలాడు. జహీరాబాద్‌లో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నాటక రాష్ట్రంలోని బసవకల్యాణ్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ మహాదేవ్(48) బసవకల్యాణ్ నుంచి జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరాడు. సుమారు 30 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు జహీరాబాద్‌కు 12 కిలోమీటర్ల ముందే సత్వార్ గ్రామ శివారులో ఓ దాబా వద్ద భోజనానికి ఆగింది. ఈ సందర్భంలో పలు మార్లు డ్రైవర్ డైనింగ్ టేబుల్‌కు తలవాల్చి ఇబ్బంది పడటాన్ని సర్వర్లు గమనించారు. అయినప్పటికీ డ్రైవర్ బస్సును తీసుకొని జహీరాబాద్ వైపు బయలుదేరాడు. అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో బాధపడుతూ జహీరాబాద్ బస్టాండ్‌కు చేరుకొని బస్సును ఓ మూలన నిలిపి బస్సులోనే కుప్పకూలిపోయాడు. వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే డ్రైవర్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. బస్సులో నుంచి అప్పటికే ప్రయాణికులంతా క్షేమంగా కిందకు దిగిపోయారు. విషయం తెలుసుకున్న బసవ కల్యాణ్ ఆర్టీసీ అధికారులు జహీరాబాద్ చేరుకున్నారు. అనంతరం సహాయక కార్యక్రమాలను పూర్తిచేసి అదే బస్సులో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు. విధి నిర్వహణలో మరణించిన మహదేవ్‌కు ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని సదుపాయాలను అందజేసి కుటుంబాన్ని ఆదుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్తులు
- జేసీబీని అధికారులకు అప్పగింత



జేసీబీని అడ్డుకున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ భూమిని జేసీబీతో చదును చేస్తుండగా పరిశీలించిన గ్రామస్తులు పనులను అడ్డుకొని, జేసీబీని అధికారులకు అప్పగించారు. ఈ ఘటన కౌడిపల్లి మండలం వెల్మకన్నెలో శుక్రవారం చోటు చేసుకుంది. మాజీ సర్పంచ్ రాజేందర్, గ్రామస్తులు అశోక్, బాగులు కథనం మేరకు.. వెల్కన్నె గ్రామ సమీపంలోని రైస్‌మిల్ వద్ద యజమాని తన భూమి హద్దు కడీలను దాటి ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు జేసీబీతో భూమిని చదును చేస్తున్నాడు. భూమిలో ఉన్న చెట్లు, మొక్కలను తొలగించాడు. అక్రమ కబ్జాను గమనించిన గ్రామస్తులు పనులను అడ్డుకొని, ప్రభుత్వ భూమి కబ్జా చేయడంఎంటని ప్రశ్నించారు. జేసీబీ పనులను నిలిపి వేసి వాహనాన్ని బీసీ కమ్యూనిటీ హాల్ వద్దకు తరలించారు. అనంతరం జేసీబీని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని జేసీబీని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ రమ్మీ

అప్పులతో యువకుడి ఆత్మహత్య

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామానికి చెందిన కొంక రమేశ్(26) గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారి కథనం మేరకు.. ఆన్‌లైన్ రమ్మీ గేమ్స్‌కి అలవాటుపడ్డ రమేశ్ ఒకట్రెండు సార్లు గెలిచి డబ్బులొచ్చేసరికి ఈజీగా సంపాదించొచ్చు అనుకున్నాడు. రమ్మీ గేమ్‌లో దాదాపు రూ.1.50 లక్షలు పోగొట్టుకొని అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొల్లూర్ పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం యూసఫ్‌గూడలో నివాసం ఉండే సాయి వంశీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతడికి విజయవాడకు చెందిన సాత్విక్‌తో పరిచయం ఏర్పడింది. విజయవాడ నుంచి గంజాయిని తీసుకెళ్తే డబ్బులు ఇస్తానని తెలిపాడు. 10వ తేదీన సాయివంశీ విజయవాడకు వెళ్లి గంజాయి తీసుకొని హైదరాబాద్‌కు వచ్చాడు. హైదరాబాద్‌లో పాన్‌షాపు నిర్వహించే స్నేహితుడు మొయినుద్దీన్‌తో కలిసి గురువారం రాత్రి ఆటో తెల్లాపూర్ పరిధిలోని ఓ మద్యం దుకాణం వద్ద గంజాయిని అమ్ముతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్‌ఓటీ, కొల్లూర్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వారిని రిమాండ్‌కు తరలించారు. సాత్విక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

సన్న బియ్యం పేరుతో మోసం

- మాయమాటలు చెప్పి ప్రజలకు దొడ్డు బియ్యం విక్రయం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో పోలీసులు

తొగుట(దుబ్బాక): సన్న బియ్యం చౌకగా విక్రయిస్తామంటూ దొడ్డు బియ్యం విక్రయించి ప్రజలను మోసం చేసిన ఘటన మండలంలోని వెంకట్రావుపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సన్న బియ్యం మార్కెట్ ధర కంటే తక్కువకు విక్రయిస్తామంటూ ఆటోలో గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో గ్రామంలోకి వచ్చారు. 25 కేజీల బియ్యం బస్తా మార్కెట్‌లో రూ.1,600 నుంచి రూ.1,800 విక్రయిస్తున్నారని తాము కేవలం రూ.1,250కే ఇస్తామంటూ ప్రజలను నమ్మబలికారు. మోసగాళ్ల మాటలను నమ్మిన అమాయక ప్రజలు రూ.2,500 వేలు చెల్లించి 25 కేజీల బస్తాలు రెండు చొప్పున తీసుకున్నారు. అంతే గాకుండా తాము మళ్లీ వస్తామంటూ బియ్యం అవసరమైతే తమకు ఫోన్ చేయాలంటూ 79955 03403 నంబర్ ఇచ్చి వెళ్లారు. వారు వెళ్లాక తీరా బియ్యం చూస్తే బస్తాలో దొడ్డు బియ్యం ఉన్నాయి. తాము మోసపోయామంటూ గ్రహించిన ప్రజలు మోసగాళ్లు ఇచ్చిన నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. గ్రామాల్లో తిరుగుతూ వస్తువులు విక్రయించే వ్యక్తులను నమ్మి కొనుగోలు చేయొద్దని ఎస్‌ఐ లింగం ప్రజలకు సూచించారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

దుబ్బాకరూరల్: అక్రమ రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మోతె శ్రీనివాస్, నూనె ప్రశాంత్, చింతల రవి, విబుది సలీమ్, సాయి ఐదుగురు కలిసి తమ మూడు ఆటోల్లో రేషన్ బియ్యాన్ని తరలించడానికి సిద్ధం చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు, దుబ్బాక పోలీసు పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్గానిక్ పద్ధతులను అలవర్చుకోవాలి

ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బాలశౌరి



అవగాహన కల్పిస్తున్న బాలశౌరి

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులు ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని ప్రాజెక్టు కో ఆర్డినేటర్ యం. బాలశౌరి అన్నారు. లోడి సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యానిదాస్ వారి సహకారంతో సంస్థ డైరెక్టర్ సంగారెడ్డి ఇన్నారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని దాదాపు 23 తండాల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై బాలశౌరి మాట్లాడుతూ..కూరగాయాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. త్వరలో లోడి సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్, విజిటేబుల్ గార్డెన్, గడ్డి గింజలు, డ్రమ్స్, లింగాకర్షణ బుట్టలు, వేపనూనె, కోడిపిల్లలు, చిరుధాన్యాలు, బావిపూడికలు, చెరువులో పూడికలు, చెక్ డ్యాం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండల ఫీల్డ్ కో ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ఫీల్డ్ స్టాఫ్ కనకం, రవీందర్, తిరుమల పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

కొండపాక(గజ్వేల్): ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని మర్పడ్గలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. గురువారం రాత్రి పూజల అనంతరం విజయ దుర్గా మాత దేవాలయం మూసివేశారు. శుక్రవారం ఉదయం పూజారి రంజిత్ శుక్ల ఆలయ గర్భగుడిలోకి వెళ్లే తాళం పగులగొట్టి ఉన్న విషయాన్ని దేవాలయ కమిటీకి సమాచారం అందించాడు. కమిటీ సభ్యులు వెళ్లి 1.750 గ్రాముల వెండి చక్రం, 2.500 గ్రాములు ముఖం ఆభరణాలు, 3.400 గ్రాముల వెండి ప్లేట్, 4.500 గ్రాములు వెండి ఆభరణాలు, బంగారు ముక్కు పుడక, తదితర ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మైసయ్య (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధి గోమారం గ్రామానికి చెందిన బ్యాగరి మైసయ్య(76) స్థానిక రైస్‌మిల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన గుమ్మడి భిక్షపతి బైక్ పై సికింద్లాపూర్ నుంచి చిన్నగొట్టిముక్ల వైపునకు వస్తున్నాడు. మార్గమధ్యలో గోమారం చౌరస్తా వద్ద బ్యాగరి నర్సయ్యకు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందగా భిక్షపతికి సైతం గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని మహిళ..

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని భవానందాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కథనం మేరకు.. భవానందపూర్ గ్రామానికి చెందిన బాసారం యాదమ్మ(56) కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా లేక ఇంటి వద్దనే ఉంటుంది. శుక్రవారం గజ్వేల్‌కు చెందిన బ్రిలియంట్ ప్రైవేట్ పాఠశాల బస్సు పిల్లలను దించడానికి గ్రామానికి వస్తుంది. ఈ క్రమంలో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు బయట నిలబడి ఉన్న యాదమ్మను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వాచ్‌మెన్



కుందన్‌కుమార్ మృతదేహం

జహీరాబాద్: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కోహీర్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీహార్‌కు చెందిన కుందన్‌కుమార్ (21) తోటి వాచ్‌మెన్‌లతో కలిసి గురువారం రాత్రి గ్రామంలో మద్యం సేవించారు. అనంతరం వెంచర్‌కు వచ్చారు. మిగితా ఇద్దరు గదిలో పడుకొని ఉండగా కుందన్‌కుమార్ ట్రాక్టర్ తాళం చెవి తీసుకొని ట్రాక్టర్ నడిపే ప్రయత్నం చేయగా తాగిన మైకంలో అదుపుతప్పి ట్రాలీ బోల్తా పడింది. ఈ క్రమంలో ట్రాలీ టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- రూ.36 లక్షల విలువ చేసే బంగారం, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సంజీవరావు, పక్కన పోలీసులు, నిందితులు

సంగారెడ్డి: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను సంగారెడ్డి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి భారీ ఎత్తున నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను అదనపు ఎస్పీ సంజీవరావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సిర్గాపూర్ మండలానికి చెందిన జాదవ్ జైరామ్, జాదవ్ శంకర్, ఇప్పా సింగ్ ముగ్గురూ సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాల్లో గ్రామ శివారు ప్రాంతాల్లోని ఇళ్లను టార్గెట్ చేసుకొని రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నారు. జూన్ 2వ తేదీ అర్ధరాత్రి అందోల్ మండలం, ఎర్రారం గ్రామంలో తాళం వేసిన 8 ఇళ్లలో, అదే నెల 8వ తేదీ అర్ధరాత్రి మాసాన్ పల్లి గ్రామంలో 4 ఇళ్లలో, 14వ తేదీ చౌటాకూర్ గ్రామంలో 5 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లడంతో బాధితులు జోగిపేట పోలీస్ స్టేషన్, పుల్కల్ పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. వరుస చోరీల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, జోగిపేట సీఐ అనీల్ కుమార్ పర్యవేక్షణలో పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్, జోగిపేట ఎస్ఐ అరుణ్ కుమార్ కొంత మంది సిబ్బందితో టీమ్‌గా ఏర్పడి దొంగల ముఠా కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు సిర్గాపూర్ మండలం బిబియా నాయక్ తండాలో నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు చేసిన నేరాలు ఒప్పుకున్నారు. దొంగతనం చేసిన సొత్తును నారాయణఖేడ్ మండలానికి చెందిన మాలి భాయ్, రాఖిలీ భాయ్ అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.36 లక్షలు విలువ చేసే 43 తులాల బంగారం, 5 కిలోల వెండి, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, జోగిపేట సీఐ అనీల్ కుమార్, జోగిపేట ఎస్ఐ అరుణ్ కుమార్, పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.